# నాటకం

చీకటి పడుతున్న వేళ అదురుతున్న గుండెలో ఆ వూరి అడ్డ రోడ్డుదగ్గర బస్సులోనించి దిగింది వైదేహి. దిగుతూనే 'వాళ్ళు ఏమంటారో' అనుకుంది. నిజానికి ఆ రోజు మధ్యాహ్నానికి ఆ వూరికి వచ్చేస్తానని వాళ్ళకు మాట ఇచ్చింది.

వైదేహితోపాటు అక్కడ ఇంకో ఇద్దరు ఆడవాళ్ళు, ఒక ముసలాయన దిగారు.

"ఇంత ఆలస్యమయిందే?" అన్నారు– ఇద్దరు మగాళ్ళు వైదేహి దగ్గరకు వచ్చి. వాళ్ళు అప్పటివరకు దూరంగా చెట్టుదగ్గిర నిలబడి ఒక రైతుతో మాట్లాడుతున్నారు. వైదేహిని రిసీవ్ చేసుకోటానికేవాళ్ళు అక్కడికి వచ్చారు.

"మా రెండో అబ్బాయికి ఒంట్లో బాగుండలేదండీ. బాగా జ్వరంగా వుంటే హాస్పిటల్లో చేర్పించి వస్తున్నాను" అన్నది క్షమాపణ చెప్పుకుంటున్నట్టు.

"ఇప్పుడెలా వుంది?" అడిగారు.

"కొంచెం తగ్గింది లెండి. అందుకే వెంటనే బయలుదేరాను" అన్నది ఆమె బ్యాగ్‌ను భుజానికి తగిలించుకుంటూ.

"ఆ సంచీని ఇటివ్వండి నేను తీసుకొస్తాను" ఆ ఇద్దర్లో ఒకాయన వైదేహి చేతిలోనుంచి బ్యాగ్‌ను తీసుకున్నాడు.

ముగ్గురూ వూళ్ళోకి నడుస్తున్నారు.

పొలాల్లో పనులు చేసి అలసిపోయిన మనుషులు పశువులతో ఇళ్ళకు బయలుదేరుతున్నారు.

అప్పుడే వెన్నెల రాబోతున్నది.

పొలాలమీద నించి చల్లని గాలివీస్తున్నది. అలా వీస్తున్న గాలికి వైదేహి పమిట తెరచాపలా అటూ ఇటూ వూగుతోంది.

"అసలు మీరు వస్తారో, రారోనని భయపడుతున్నాం. ఈ బస్సుకి మీరు రాకుండా ఉన్నట్లయితే మేమే బయలుదేరి వచ్చేవాళ్ళం" ఒకాయన అన్నాడు ఆమె నుద్దేశించి నడుస్తూనే.

"అలాగా" అన్నది.

కంకర రోడ్డుమీద జాగ్రత్తగానే నడుస్తూంది వైదేహి. అటు వంటి రోడ్డుమీద అప్పుడప్పుడు నడవటం ఆమెకు అలవాటే.

"అయినా మీరు తప్పకుండా వస్తానని మాట ఇచ్చారు కాబట్టి, మాకు ధైర్యంగా వుంది" అన్నాడాయన సంచీని మరో చేతిలోకి మార్చుకుంటూ.

"ఏర్పాట్లన్నీ పూర్తయినాయా?" అడిగింది.

"ఆఁ. అన్నీ పూర్తయినట్టే. జనరేటర్ కూడా రెడీగా వుంది. స్టేజీకి లైట్లు బిగిస్తున్నారు- మేము వూళ్ళోనించి బయల్దేరినప్పుడు. ఇప్పటికి ఆపని కూడా పూర్తయి ఉంటుంది".

"ఎన్ని వూళ్ళలో పబ్లిసిటీ చేయించారు?" అడిగింది మళ్ళీ.

"చుట్టుపక్కల ఎనిమిది వూళ్ళలో టికెట్లు బాగానే అమ్ముడు పోయాయి. జనం ఇంకో గంటలో వచ్చేస్తారు. మనం పది గంటల లోపలే నాటకం మొదలుపెడితే బాగుంటుంది. ఒంటి గంటయ్యేసరికి అయిపోతుంది. మరీ ఆలస్యమైతే పక్క వూళ్ళనించి వచ్చిన మనుషులు తిరిగి వెళ్ళాలంటే మరీ పొద్దుపోతుంది" అన్నాడాయన బీడీ వెలిగిస్తూ.

"మీరందరూ రిహార్సల్స్ వేసుకోవటం అయిపోయిందా?"

"అయిపోయింది. ఇక చివరి రిహార్సల్ ఒక్కటే మనం వెయ్యాలి. మీకు పోర్షన్ బాగా వచ్చిందికదా?"

"పోర్షన్ ఎప్పుడో వచ్చింది. బస్సులో వస్తూ ఒకసారి బుక్‌లో చూసుకున్నాను. అయినా ఈ 'జీవితం' నాటకాన్ని ఇప్పటికి నలభై సార్లు ఆడాను. పోర్షనంతా బాగవచ్చు. మిగిలిన నటులందరికీ పోర్షన్లు బాగా వచ్చాయా?" ఎగురుతున్న పమిటను నడుముకి బిగిస్తూ అడిగింది వైదేహి.



"అందరికీ వచ్చేశాయి. దాదాపు మూడు నెల్లనించీ రిహార్సల్ వేస్తున్నాము. ఆ భయం లేదులెండి" అన్నాడు సంచీ మోస్తున్న మనిషి.

ముగ్గురూ వూళ్ళోకి వచ్చారు.

చంద్రుడు కొంచెం పైకి వచ్చాడు.

ఇళ్ళ దీపాలు ఎర్రగా వెలుగుతున్నాయి.

కొంతమంది కుర్రకారు పిల్లలు వైదేహిని, పక్కనేవున్న ఇద్దరు మనుషులను చూసి ఆమెను డ్రామా నటిగా గుర్తించారు. వాళ్ళు ఆమె వెనకే నడవటం మొదలుపెట్టారు.

వెన్నెల వెలుగు అంతటా పరుచుకుంటుంది. వెన్నెట్లో ఆ పల్లెటూరి రోడ్లు బాగా కనపడుతున్నాయి.

ఇళ్ళ బయట అరుగుల మీద కూర్చున్న మనుషులు వైదేహి గురించి అడుగుతున్నారు.

"డ్రామా నటి. ఇప్పుడే వస్తూంది." అని చెబుతున్నారు ఆమె పక్కనే వున్నవాళ్ళు.

వాళ్ళు ఒక రోడ్డుమలుపు తిరిగేసరికి నాటకం వేస్తున్న మైదానం కనిపించింది.

వూరిమధ్య ఖాళీగా ఉన్న ప్రదేశం. అక్కడ మధ్యలో స్టేజీ కట్టారు. చుట్టూ కొంతమేర తడికెలు కట్టారు. కొంచెం దూరంలో జనరేటర్ చప్పుడు డబడబమని వినపడుతూంది.

డ్రామా నటి వచ్చిందని తెలియగానే స్టేజీమీద సినిమా రికార్డులు వెయ్యటం మొదలుపెట్టారు.

వైదేహిని స్టేజీ వెనకవున్న ఒక పెంకుటింట్లోకి తీసుకువెళ్ళారు. అక్కడ ఒక గదిలో మేకప్ చేసుకోటానికి నటులందరూ సిద్ధంగా ఉన్నారు. వాళ్ళు ఆమెకోసం ఎదురుచూస్తూ కూర్చున్నారు. ఆమెను చూడగానే "వచ్చారా? మీగురించే అనుకుంటున్నాం" అన్నారు సంతోషంగా.

వాళ్ళందరికి తన ఆలస్యానికి కారణంచెప్పి క్షమాపణ కోరింది. ఆమె కొడుక్కి అలావున్నా, వైదేహి నాటకంలో నటించటానికి వచ్చి నందుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

"అయితే ఇంకా ఆలస్యందేనికి? ఫైనల్ రిహార్సల్ వేద్దాం" అన్నారు వాళ్ళు.

సరేనన్నది వైదేహి.

ఎవరో ఆమెకు కాఫీ ఇచ్చారు. వేడిగా ఉంది కాఫీ. తాగింది. ఆమెకు కొంచెం హాయిగా ఉన్నట్లు అనిపించింది.

ఆమెకు జ్వరంతో బాధపడుతూ హాస్పటల్లో పడివున్న కొడుకు గుర్తుకు వచ్చాడు. వెంటనే ఆమె మొహంనిండా విచారం అలుము కుంది.

ఫైనల్ రిహార్సల్ మొదలయింది.

బలవంతాన ఆలోచనలను కొడుకు మీదనించి మరల్చుకుంటూ డైలాగులు చెబుతూంది ఆమె.

దాదాపు ముప్పావు గంట తరువాత ముఖ్యమైన సీన్లకు ఫైనల్ రిహార్సల్ అయిపోయింది.

"నేను స్నానం చెయ్యాలి" అన్నది వైదేహి ఒకాయనతో.

"అలాగే. వేడినీళ్ళు సిద్ధంగా ఉన్నాయి." అని ఒకతన్ని పిలిచి వైదేహికి స్నానాలగది చూపించమన్నాడా యన.

పావుగంట తర్వాత వైదేహి స్నానంచేసి చీరమార్చుకు వచ్చింది. ఆమె వచ్చేసరికి భోజనం సిద్ధంగా వుంది.

ఆమెకు భోజనం సయించలేదు.

ఎనిమిదిన్నరకల్లా మేకప్ మొదలయింది. ఈ లోపల మిగిలిన నటులందరూ ఇళ్ళకు వెళ్ళి భోజనాలు చేసివచ్చారు.

బయట స్టేజీమీద పాటలు వేస్తున్నారు. కొంతమంది మనుషులు మేకప్ రూంలోకి రావటానికి ప్రయత్నిస్తున్నారు. కాని ఎవరోగుమ్మం దగ్గరవుండి వాళ్ళను లోపలికి రానివ్వటం లేదు.

కళ్ళకు కాటుక దిద్దుకుంది వైదేహి.

ఆమె తన మేకప్ తనే చేసుకుంటుంది. ఐబ్రోపెన్సిల్ తో కను బొమ్మలను సన్నగా దిద్దుకుంది. పెదవులకు లిప్‌స్టిక్ పూసుకుంది.

మేకప్ యాంత్రికంగా జరుగుతోంది. వైదేహి ఆలోచనలన్నీ హాస్పటల్లో ఉన్న కొడుకు గురించే.

ఆరోజు ఉదయమే వాడికి జ్వరం మొదలయింది. తనుఏవో టాబ్లెట్లు వేసింది. వాడికి ఎనిమిదేళ్ళుంటాయి. జ్వరం తగ్గినట్లే తగ్గింది. తీరా తను పూరికి బయల్దేరేముందు మళ్ళీ వచ్చింది. ఒళ్ళంతా కొలిమిలా అయిపోయింది. గబగబా వాడిని హాస్పిటల్ కి తీసుకువెళ్ళింది. డాక్టర్ ఏదో ఇంజక్షన్ ఇచ్చాడు. ఆ రోజల్లా హాస్పిటల్లో ఉంచమన్నాడు కొడుకుని. తనుకొడుకు దగ్గర ఉండిపోవాలనుకున్నది వైదేహి. కానితను వుండిపోతే ఎలా? ఆరోజు రాత్రికి తనకు ఒక నాటకం వుంది. ఇరవై రోజులక్రితమే ఆ నాటకం వేస్తున్నవాళ్ళు తన దగ్గరకు వచ్చి అన్ని విషయాలూ మాట్లాడారు. తను ఆ నాటకంలో హీరోయిన్ వేషం వెయ్యటానికి ఒప్పుకుని వాళ్ళ దగ్గర అడ్వాన్సుగా డబ్బు కూడా తీసుకుని నాటకం వేసే రోజు మధ్యాహ్నానికి తప్పకుండా వస్తానని మాట ఇచ్చింది.

మరి ఇప్పుడు వెళ్ళకపోతే ఎలా? నాటకాలు వెయ్యటమే తన వృత్తి. నాటకాలు ఆడి తను జీవిస్తూంది. తను వెళ్ళక తప్పదు. అందుకే ఇంటిపక్కనే వుండే ఒకాయన్ని బ్రతిమలాడి కొడుకు దగ్గర తను వచ్చేవరకూ ఉండేలా ఒప్పించి పదిరూపాయలు ఇచ్చి వచ్చింది.

నటులందరూ మేకప్ చేసుకోవటం పూర్తయింది.

స్టేజీమీద పాటవెయ్యటం ఆపి మధ్యలో కొంచెసేపట్లో నాటకం మొదలవబోతున్నదనీ, అందరినీ త్వరపడమనీ, నాటకంవేసే స్థలం దగ్గరే టికెట్లు అమ్ముతున్నారనీ ఎవరో మైకులో చెప్పారు. తర్వాత మళ్ళీ పాట మొదలయింది.

అద్దంలో తన మొహాన్ని చూసుకుని అక్కడక్కడా ఎక్కువగా వున్న పౌడర్‌ని సరిచేసుకుంది వైదేహి.

మిగిలిన నటులు కొందరు ఆమెతో కబుర్లు మొదలుపెట్టారు.

"మీభర్త ఏం చేస్తూవుంటారు?" ఎవరో అడిగారు.

"ఆయనకు నాగార్జునసాగర్‌లో ఒక ఆఫీస్‌లో ఉద్యోగం" వెంటనే అన్నది వైదేహి.

నిజానికి వైదేహిని భర్తవదిలేసి రెండేళ్ళయింది. అతను కూడా ఇంతకు ముందు నాటకాలు ఆడేవాడు. హీరో వేషాలు వేసేవాడు. వైదేహి పెళ్ళికాకముందు అతనితో కలిసి ఎన్నో నాటకాల్లో నటించింది. తర్వాత ఇద్దరూ పెళ్ళి చేసుకోలనుకున్నారు. అప్పటికి వైదేహి తల్లి బతికే ఉన్నది. ఆమెకూడా ఇద్దరి పెళ్ళికి ఒప్పుకుంది. అతనితో ఆమె పెళ్ళి అయింది.

పెళ్ళయిన తర్వాత అతను ఆమెను సరిగా చూడలేదు. తాగా తాగుడికి అలవాటు పడ్డాడు. నాటకాల్లో నటించటం మానేశాడు. వైదేహి సంపాందించిన డబ్బునంతా వృధాగా ఖర్చుచెయ్యటం మొదలు పెట్టాడు. కొన్నిరోజులు సహించింది ఆమె. తర్వాత ఎదురు తిరిగింది. ఫలితం వైదేహిని వదిలేశాడు. తర్వాత అతను ఇంకోసటిని చేరదీశాడు. అప్పటికే వైదేహి తల్లిపోయింది. ఇద్దరు పిల్లలు.

నాటకం మొదలయింది.

మనసులో దేవుడికి దణ్ణం పెట్టుకుని స్టేజీ మీదకు వెళ్ళింది వైదేహి.

జనం బాగానే వచ్చారు.

ప్రార్థన తర్వాత తెరతీయగానే జనమంతా ఆత్రుతగా వైదేహిని చూశారు. వైదేహి బాగా అందమయింది. అంతేకాదు తన అందం రెట్టింపు అయ్యేలా ఆమె మేకప్ చేసుకున్నది.

తను రాకుండా వుంటే ఇంతమంది జనం నిరుత్సాహపడిపోయే వాళ్ళేననుకుంది అంతమంది మనుషులను చూడగానే. ఇంకోసారయితే ఎంతో ఉత్సాహాన్ని తెచ్చుకునేది ఆమె. ఆమె తల్లి ఎప్పుడూ చెబుతూ ఉండేది– జనం ఎక్కువమంది వున్నప్పుడే కళాకారులెవరికైనా తమ గొప్ప తనాన్ని, కళానైపుణ్యాన్ని ప్రదర్శించాలని అనిపిస్తుందట. వైదేహి తల్లి మంచి నటి. ఆమెకూడా నాటకాల్లో నటించింది.

వైదేహి తన కొడుకు ఆరోగ్యం గురించి కలవరపడుతూ ఉండటంవల్ల అంతమంది జనాన్ని చూసినా ఉత్సాహాన్ని తెచ్చుకోలేక పోయింది.

నాటకం జరుగుతూంది.

అతి కష్టంమీద మనసును, ఆలోచనలను కొడుకుమీద నుంచి మరల్చుకుంటూ నటిస్తూంది వైదేహి.

తను ప్రేమించిన వాడినే పెళ్ళి చేసుకుంటాననీ, ఇంకో మనిషి నచ్చినా చేసుకోననీ, బలవంతాన ఎవరికయినా ఇచ్చి చెయ్యాలనుకుంటే నుయ్యో గొయ్యో చూసుకుంటాననీ తండ్రితో ఆవేశంగా చెబుతూంది హీరోయిన్ పాత్ర ధరించిన వైదేహి.

అంతటా నిశ్శబ్దంగా ఉంది.

జనమంతా నాటకం చూడటంలో నిమగ్నమయిపోయారు.

వైదేహి బాగా నటిస్తూంది. మధ్య మధ్యలో జనం ఆమె డైలాగులకు చప్పట్లు కొడుతున్నారు.

తాత్కాలికంగా వైదేహి కొడుకు గురించి మరిచిపోయింది.

చివరికి హీరోయిన్ తండ్రి తన కూతురు ప్రేమించిన వాడితోనే పెళ్ళి జరిపించటానికి ఒప్పుకున్నాడు.

ఆ సీను అంతటితో అయిపోయింది.

తెర వాలింది

వైదేహి మేకప్ గదిలోకి వచ్చింది. ఆ తర్వాత సీనులో వైదేహి లేదు.

మధ్యలో వది నిముషాల బ్రేకు ఉంది. తరువాత సీనులో హీరో, హీరోయిన్ కలుసుకుంటారు. ప్రేమగురించి మాట్లాడుకుంటారు మళ్ళీ.

వైదేహి గదిలోకి రాగానే ఎవరో ఒకాయన ఇంకో మనిషిని వెంటపెట్టుకుని ఆగదిలోకి వచ్చాడు. ఆయన్ను చూడగానే వైదేహి ఆశ్చర్యపోయింది.

ఆయనే వైదేహి ఇంటి పక్కాయన. ఆయన్నే ఆమె హాస్పిటల్లో కొడుకు దగ్గర వుంచి వచ్చింది

"ఏమిటి ఇంత రాత్రప్పుడు వచ్చారు?" గబగబా అడిగింది.

"నీకు ఎట్లా చెప్పాలో అర్థంకావటం లేదమ్మాయ్" అన్నాడు.

"ఏమిటండీ? ఏమయింది? వాడికి ఎట్లా వుంది?" అడిగింది కంగారుగా.

"ఇంకెక్కడి వాడు, తల్లీ? వాడు ఎనిమిది గంటలకే ఈ ప్రపంచం నించి వెళ్ళిపోయాడు" అన్నాడాయన.

ఆ మాట వినగానే ఘొల్లుమన్నది వైదేహి. దుఃఖం ఆమె గుండెను తన్నుకుని వచ్చింది. ఆమె గుండెల్లో మంట చెలరేగింది.

తన కొడుకు చనిపోయాడా!?

అయిదు నిముషాల వరకూ ఏడుస్తూనే ఉన్నది.

"పూరుకో, అమ్మాయ్, పూరుకో - వాడికి ఈ భూమ్మీద ఋణం తీరిపోయింది. నువ్వు వెంటనే బయల్దేరాలి" అన్నాడాయన.

కొంతసేపు తర్వాత "ఇప్పుడు రావటానికి వీల్లేదండి. నాటకం అయిపోగానే ఇద్దరం బయల్దేరుదాం" అన్నది ఏడుపు ఆపి.

"నాటకం అయ్యేవరకూ రావా!?"అన్నాడాయన ఆశ్చర్యంగా.

"రాలేను. రావటానికి వీల్లేదు. ఈ నాటకాలే నా జీవనం. ఇప్పుడు నేను మధ్యలో రాలేను. అందుకే మీరు ఇక్కడే పడుకుని నిద్రపోండి. నాటకం అయిపోగానే వచ్చి లేపుతాను" అని పౌడర్ మొహానికి పూసుకుని అక్కడినించి గబగబా స్టేజీ మీదకు వెళ్ళింది వైదేహి రెండో సీను అయిపోగానే.

మూడో సీను మొదలయింది.

హీరో- హీరోయిన్‌ని నవ్విస్తున్నాడు. ఆమె నవ్వు గురించి పొగుడుతున్నాడు.

కొడుకుపోయిన విషయాన్ని వెనక్కు నెట్టివేస్తూ కిలకిలా నవ్వు తోంది వైదేహి.

"ఇంకా నవ్వాలి. ప్రేయసీ. నీ నవ్వును చూస్తూ ఈప్రపంచాన్నే మరచిపోవాలి" అంటున్నాడు హీరో పాత్రధారి.

నవ్వుతోంది వైదేహి పొంగివచ్చే దుఃఖాన్ని ఆపుకుంటూ. నిమిషం తర్వాత ఆపులేకపోయింది ఆమె. కిలాకిలా నవ్వుతున్నదల్లా గట్టిగా ఏడ్చేసింది స్టేజి మీద.

హీరో పాత్రధారి, చూస్తున్న జనమంతా ఉలిక్కిపడ్డారు. వాళ్ళకు అసలు విషయం తెలీదు.

అలా ఏడుస్తూనే వుంది వైదేహి, కింద కూలిపోయి.

జనం హీరోయిన్‌కు పిచ్చి పట్టిందనుకున్నారు. కొంతమంది ఉత్సాహవంతులైన యువకులు "హీరోయిన్ పిచ్చిది" అని అరుస్తూ స్టేజీమీదకు రాళ్ళు విసిరారు.

నాటకం చెడిపోయింది.

*

(7-10-1981 ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక)